మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట

జగ్గయ్యపేట: ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. జగ్గయ్యపేట మండలం బండిపాలెం, గుండబోయినపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో రైతులు, యువత, మహిళలతోపాటు అన్ని వర్గాలను సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయని వైనంపై గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరు సైనికుల్లా పని చేయాలని కోరారు. అనంతరం గుండబోయినపాలెం గ్రామ కన్వీనర్‌గా అంగడాల సత్యనారాయణను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, బండిపాలెం గ్రామ అధ్యక్షుడు బండి రంజిత్‌కుమార్, నాయకులు దర్శనాల వెంకటరమణ, చల్లా వైకుంఠరావు, బసిపోగు ఆనంద్‌పాల్, పాతకోటి ఉదయభాను, గద్దం రామకృష్ణ, గూడపాటి శేషయ్య, తుమ్మలపల్లి మధుసూధన్, గూడపాటి వెంకయ్య, గూడపాటి వెంకటేశ్వరరావు, అన్నాబత్తుల శ్రీనివాసరావు, అంగడాల వెంకయ్య, బూతుకూరి కొండారెడ్డి, గురవారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బండిపాలెంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



జగ్గయ్యపేట పట్టణంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ నేతలు

హామీల పేరుతో కూటమి నేతల దగా..

జగ్గయ్యపేటఅర్బన్: ఎన్నికలకు మేనిఫెస్టో పేరుతో వందకుపైగా హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు, వాటిలో ఏ ఒక్కటినీ సరిగా అమలుచేయకుండా ప్రజలను నిలువునా దగా చేశారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డు కాకానినగర్, డాంగేనగర్, 13, 22వార్డుల్లోని చాకలిబజారు, నాగమయ్యబజారులో ఆదివారం ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను అందరూ ఎండగట్టాలన్నారు. హామీలు అమలుచేయకుండా కూటమి చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ బషీరున్నీసా, పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర చేనేత విభాగం అధికారప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు, నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వేల్పుల నవీన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, పట్టణ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా, స్థానిక నాయకులు దేవరశెట్టి వీరాంజనేయులు, చారాల నాగాచారి, షేక్ మౌలాలి, షేక్ మహ్మద్, గుగ్గిళ్ల నరేష్, చారాల గోపి, తిరుపతిరెడ్డి గోవిందరెడ్డి, సాంబశివరావు, కాశేశ్వరరావు, పింగళి రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస ఆదివారం సందర్భంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక అద్దాల బజారులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి తదితర ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.బోనాలు సమర్పణ..శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మొదటి ఆదివారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించారు. నోముల కుటుంబీకులు బోనాలు సమర్పించారు. నోముల కుటుంబీకుల తరఫున శివ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు, నోముల కుటుంబీకులు సమర్పించే బోనాలతో, జలబిందెలతో శోభాయాత్రగా ఆలయానికి తరలివచ్చారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు అప్పన మణికుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, కార్యదర్శి కొత్తా రమేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి కొంకిమళ్ల సురేష్, కోశాధికారి అప్పన పిచ్చయ్య, కమిటీ సభ్యులు వెంకటశ్రీరంగం, దేవరశెట్టి నాగప్రసాద్, తునికిపాటి నాగ, మల్లేశ్వరచారి, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న నోముల కుటుంబీకులు

క్లుప్తంగా

ముత్యాలమ్మకు బోనాలు



మంగొల్లు(వత్సవాయి): శ్రావణమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని వత్సవాయి మండలం మంగొల్లులో ముత్యాలమ్మకు బోనాలు నిర్వహించారు. ముందుగా మహిళలు తమ ఇళ్లలో పూజలు నిర్వహించుకుని పాలపొంగళ్లు చేసుకుని అందరూ గ్రామంలో ఒకచోటకు చేరారు. అనంతరం అక్కడ నుంచి మహిళలంతా కలిసి డప్పువాయిద్యాల నడుమ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా పండి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

సిమెంట్ బల్లల వితరణ



జగ్గయ్యపేట అర్బన్: వాకర్స్ ఫ్రెండ్స్ సభ్యులు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో క్రీడాకారుల సౌకర్యార్థం రూ. 35వేల విలువైన 10 సిమెంట్ బల్లలను అందజేశారు. ఈసందర్భంగా ఆదివారం వాకర్స్ ఫ్రెండ్స్ తీసుకువచ్చిన సిమెంట్ బల్లలను పాఠశాల హెచ్‌ఎం పారేపల్లి నాగేశ్వరరావు, పీడీల సమక్షంలో క్రీడామైదానంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బల్లలు అందజేసిన దాతలు కొత్తా రమేష్‌కుమార్, మద్దుల జయప్రకాష్, చిన్నం సీతారామకృష్ణప్రసాద్, సొగ్గాల ఉమామహేశ్వరరావు, తునికిపాటి వెంకటేశ్వర్లు, తేలుకుంట్ల భారతి, తుమ్మేపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

నాగసత్తెమ్మకు పూజలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ సమీపంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్దనున్న శ్రీనాగసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి జేఎల్‌ఎం(జగ్గయ్యపేట లైమ్ స్టోన్‌మైన్స్) కాలనీ వాసుల బోనాలు సమర్పించారు. జేఎల్‌ఎం ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జేఎల్‌ఎం అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు, సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు టీఎల్‌ఎన్ ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్, సంపత్ జానకిరాముల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీజీఎం మైన్స్ మాధవరం ఇన్‌చార్జ్ బీయూవీఎన్ రాజు దంపతులు, పూర్వ ఉద్యోగి ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఘనంగా రిజర్వేషన్ డే వేడుకలు



నందిగామటౌన్: స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో ఆదివారం రిజర్వేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈఏడాది పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ మాట్లాడుతూ 1902లో ఛత్రపతి సాహూ మహారాజ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. ఛత్రపతి సాహూ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకునే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బహుజన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రతిపాటి సూర్యం, ఉపాధ్యాయ సంఘ నాయకులు కామా ప్రభాకర్, పారా సురేష్, జాషువా ఫౌండేషన్ కోట రవీంద్రనాథ్, నాయకులు యర్లగొర్ల ఉదమ్‌కిరణ్, కామా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం భవానీ బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ జరిగింది. 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బార్‌ను క్లోజ్ చేసి క్యాషియర్ పప్పు రవిశేఖర్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం 9.30గంటల సమయంలో క్లీనింగ్ చేసేవారు వచ్చి చూసి, కౌంటర డోర్ పగులగొట్టి క్యాష్ బాక్స్ తెరిచి ఉందని క్యాషియర్‌కు ఫోను చేసి చెప్పారు. క్యాషియర్ బార్ వద్దకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బాక్స్‌లో ఉన్న రూ.1.50 లక్షలు చోరీ చేసినట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి సారూ!

మక్కపేట(వత్సవాయి) : మక్కపేట నుంచి భీమవరం మీదుగా జాతీయ రహదారికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా మక్కపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రహదారి అంతా గుంతలమయంగా ఉంది. వర్షాలు పడిన సమయంలో ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో పలువురు గాయాలపాలయ్యారు. జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా రుసుం తప్పించుకోవడానికి ఖమ్మం నుంచి వచ్చే వాహనాలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుండటం కూడా ఈ రోడ్డు అధ్వానంగా మారడానికి ఓ కారణమని చెప్పవచ్చు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు పలుచోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మక్కపేట జెడ్పీ పాఠశాల వద్ద అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

30 నుంచి గ్రామస్థాయిలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

నందిగామరూరల్: ఈనెల 30వతేదీ నుంచి నందిగామ మండలంలోని 13 గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు మూడో తేదీ వరకు ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 30న పల్లగిరి, రాఘవాపురం, కమ్మవారిపాలెం గ్రామాల్లో, 31న కంచల, ఐతవరం, అంబారుపేట, ఆగస్టు ఒకటోతేదీన తక్కెళ్లపాడు, లింగాలపాడు, రెండోతేదీన మునగచర్ల, అడవిరావులపాడు, పెద్దవరం, మూడోతేదీన చందాపురం, కేతవీరునిపాడు గ్రామాల్లో నిర్వహిస్తామని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘననివాళి

జగ్గయ్యపేట అర్బన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహనీయుడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కోదాడ రోడ్‌లోని కలాం విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ క్షిపణి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు.

అబ్దుకలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సూచించారు. కలాంకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ప్రధానకార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర లీగల్ సెల్ నాయకుడు సత్యశ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, నాయకులు ఇమ్రాన్ పాషా, మన్నె అప్పారావు, సంపంగి గోపాలకృష్ణ, దేవరశెట్టి వీరాంజనేయులు, మారిశెట్టి అనిల్, ప్రవీణ్, చల్లా ఉపేంద్ర ఉన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

నివాళులర్పించిన ఎమ్మెల్యే..

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కోదాడ రోడ్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ

కలాం కలను సాకారం చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ ఖాసిం, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వరరావు, నాయకులు నూకల బాలకృష్ణ, నోముల రఘు, వెల్ది శ్రీనివాసరావు, నలజాల రామకృష్ణ, పూసల పుల్లారావు, మెట్టెల రమణ, పితాని హరినాథ్, నున్న సాయి, సత్య పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ సామినేని ఉదయభాను పూలమాలలువేసి నివాళులర్పించారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో దేశానికి కలాం చేసిన సేవలను స్మరించుకున్నారు.

అధ్వాన రోడ్లతో ప్రజలకు అవస్థలు

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఆయా రోడ్లపై భారీ గోతులు ఏర్పడగా, వర్షాల సమయంలో ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పలుచోట్ల రోడ్లపై తారు లేచిపోయి రాళ్లు మొనతేలి ఉండటంతో ఇబ్బందులుపడుతున్నట్లు వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. వత్సవాయి నుంచి చెవిటికల్లు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి వీరులపాడు మండలంలోని పల్లంపల్లి నుంచి కొణతాలపల్లి, వెల్లంకి, గోకరాజుపల్లి, బోడవాడ, జమ్మవరం వరకు గోతులమయమైంది. జుజ్జూరు–నరసింహారావుపాలెం, తాటిగుమ్మి–గండేపల్లి రోడ్డులు కూడా దెబ్బతినడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్న కూటమి ప్రభుత్వం ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటం ప్రజల పాలిటశాపంగా మారింది. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రోడ్లకు మర్మమతులు చేపట్టాలని వీరులపాడు మండల ప్రజలు కోరుతున్నారు. రోడ్ల పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శశిభూషణ్‌ను వివరణ కోరగా, వత్సవాయి–చెవిటికల్లు రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వానికి అంచనాలు పంపించినట్లు తెలిపారు. మిగిలిన రోడ్లకు మరమ్మతులు చేపడతామని వివరించారు.



గోతులమయమైన పల్లంపల్లి రోడ్డు



కొణతాలపల్లిలో చెరువును తలపిస్తున్న రోడ్డు



గోకరాజుపల్లి గ్రామశివారులో అధ్వానంగా ఉన్న రోడ్డు



వెల్లంకిలో రోడ్డులోని గుంతల్లోకి చేరిన వర్షపు నీరు



నరసింహారావుపాలెం శివారులో రోడ్డు పరిస్థితి ఇది

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు శ్రావణ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



ప్రత్యేకాలంకరణలో శ్రీతిరుపతమ్మ అమ్మవారు

దుర్గంధభరితంగా నందిగామ–మధిర రోడ్డు

నందిగామరూరల్: నందిగామ–మధిర రోడ్డు చెత్తమయంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు పక్కన పడేసిన చెత్త వర్షానికి తడిసి దుర్గంధం వెదజల్లుతుండటంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని సమీపంలోని ఇళ్లప్రజలు, కళాశాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పదేపదే చెప్పే ప్రభుత్వాధికారులు నివాస ప్రాంతాలకు కూతవేటు దూరంలో ఇలా రోజుల తరబడి చెత్తం నిల్వఉంటుడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అంటూ నెలకు ఓరోజు హడావుడి చేయడం మినహా ఎటువంటి ప్రయోజనం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నందిగామ–మధిర రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.



నందిగామ-మధిర రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆందోళనలో పత్తిసాగు రైతులు

పెనుగంచిప్రోలు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్టపంటలకు చేటుగా మారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలకు పొలాలు మొత్తగా నాని వర్షపు నీరు నిల్వ ఉంటుండటం పత్తిసాగు నష్టమని రైతులు చెబుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో కలిపి ఇప్పటివరకు 15వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మరో 2వేల నుంచి 3వేల ఎకరాల్లో పత్తిసాగు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వర్షాలకు పత్తిపంట నీటమునిగి మొక్కలు కుళ్లిపోతాయి. అధిక తేమ కారణంగా పంట ముడుచుకుపోతుంది. పత్తి ఆకులు ఎర్రబడి చెట్టు మొత్తం ఎర్రగామారి ఎండిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

సస్యరక్షణ చర్యలో భాగంగా రైతులు వర్షం తగ్గిన వెంటనే పత్తిపంట ఎకరానికి 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి.సూక్ష్మ పోషక లోప నివారణకు ఫార్ములా–4 పొటాషియం నైట్రేట్ వంటి సూక్ష్మ పోషకాలు కలిగిన ఎరువులను పైపాటుగా పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మిరపనారు మడుల్లో తెగులు గమనించినట్లయితే లీటర్ నీటికి రెండున్నర గ్రాముల బ్లైటాక్స్ కలిపి పిచికారీ చేసుకోవాలని, వర్షం తగ్గిన వెంటనే ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ చల్లుకుంటే సరిపోతుందని వ్యవసాయాధికారులు వివరించారు.



పత్తి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



వరద నీటి ప్రవాహం ధాటికి వడలిపోతున్న పత్తి మొక్కలు

నేడు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం

కంచికచర్ల : రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న మహిషాసురమర్దిని నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై చెన్నైకు చెందిన మధుర కళానికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన మీనాక్షి– మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం డాక్టర్ మల్లంపల్లి మాధవి పర్యవేక్షణలో చెన్నైకు చెందిన కళాకారులు గురు, రోజారాణి, దుర్గా, నటరాజ్ బృందం మహిషాసురమర్దిని నృత్య రూపకాన్ని ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు